క్లుప్తంగా

వైభవంగా అరవాలమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో అరవాలమ్మ

సీతానగరం: మండలంలోని చీపురుపల్లి పంచాయతీ పరిధి అచ్చయ్యపాలెంలో కొలువైన అరవాలమ్మ జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మునికూడలిలో నేడు రీ సర్వే గ్రామసభ

సీతానగరం: మునికూడలి సచివాలయం వద్ద బుధవారం రీసర్వే గ్రామసభ నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ వెంట భూమి రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా, ఆధార్ జిరాక్స్ కాపీలు, ఫోన్ నెంబర్‌ను గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాలన్నారు. చనిపోయిన భూ యజమానుల వారసుల వారి పేరుపై మార్చుకోవడానికి, కొనుగోలు చేసిన భూమిని తమ పేరుపై మార్చుకోవడానికి సంబంధించి రికార్డులు అధికారులకు అందించాలన్నారు. భూములను రీసర్వే చేసే తేదీ, సమయాన్ని నోటీసుల ద్వారా తెలియజేస్తామన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

బిక్కవోలు: మండలంలో నూతనంగా మంజూరైన 40 వితంతు పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ తేతలి సుమ, మాజీ జెడ్పీటీసీ పడాల రాము తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన


బూరుగుపూడిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

కోరుకొండ: బూరుగుపూడి గ్రామ దేవత పాశాలమ్మ వారి జాతర ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు 400 కేజీలు బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఆయన ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీడ్రాలో 300 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, ఆలయ ధర్మకర్త మేడిన ప్రసాద్, పూజారి మాగాపు వీరబాబు పాల్గొన్నారు. కాగా..దీనికి ముందు శ్రీరంగపట్నంలో జరుగుతున్న నూకాలమ్మ ఉత్సవాల్లో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నీటి తొట్టెల ఏర్పాటుకు శ్రీకారం


కలవచర్లలో నీటి తొట్టె నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం: వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలను నిర్మించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని కలవచర్లలో నీటి తొట్టెల నిర్మాణానికి మంగళవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. చెరువులలో నీరు ఇంకిపోతున్న సమయంలో నీటి తొట్టెలలో నీటిని ఉంచడం ద్వారా పశువుల దాహార్తిని తీర్చవచ్చన్నారు. ఇదే గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసే కార్యక్రమాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉపాధి కూలీలతో రైతులకు చెందిన పామాయిల్ తోటల్లోని చెట్లకు రింగ్ ట్రెంచెస్‌లు ఏర్పాటుచేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఏ ఝాన్సీ, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

14 గ్రామాల్లో నిర్మాణానికి చర్యలు

పెదపూడి: పశువులకు తాగునీటి ఇబ్బంది లేకుండా గ్రామాల్లో నిర్మిస్తున్న నీటితొట్టెలు ఉపయోగపడతాయని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. దోమాడ గ్రామంలో నీటి తొట్టె నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఒక్కొ నీటి తొట్టెను రూ.35,200 అంచనాతో నిర్మిస్తున్నామన్నారు. మండలంలో సుమారు 14 గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణానికి ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు శంకుస్థాపనలు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మీనవల్లి శారదాదేవి, మీనవల్లి సత్తిబాబు, ఎం.దొరబ్బాయి, సచివాలయం కార్యదర్శి సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులకు షాక్

- ఈ–కేవైసీ తప్పనిసరి చేసిన కూటమి ప్రభుత్వం
- లేకపోతే రేషన్ కట్
- ఈ నెలాఖరు వరకూ గడువు
- దూర ప్రాంతాలకు వెళ్లిన కూలీల ఆవేదన


ఎండీయూ వాహనంలో రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

బిక్కవోలు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సంక్షేమ పథకాల లబ్ధిదారులను తగ్గించేందుకు అనేక సర్వేలను నిర్వహిస్తోంది. ఇప్పటికే దివ్యాంగులకు ఇచ్చిన సర్టిఫికెట్లపై సమీక్ష చేయించింది. తాజాగా రేషన్ కార్డుల్లో ఉన్న యూనిట్లు తగ్గించి, రేషన్ బియ్యం మిగుల్చుకోవడానికి కుట్ర చేస్తోంది. కార్డుల్లో ఉన్న ప్రతి లబ్ధిదారుడూ ఈ–కేవైసీ చేయకపోతే రేషన్ ఇవ్వడం జరగదని ప్రచారం చేస్తోంది. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబాన్ని ఒక్కో యూనిట్‌గా పరిగణించి ఈ–కేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఐదేళ్ల లోపు చిన్నారులకు అవసరం లేదు. మిగిలిన వారందరూ డీలర్లు, వీఆర్వోలు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద తక్షణమే ఈ–కేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీని కోసం ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు విధించింది. దీనివల్ల వ్యవసాయ కూలీలకు కష్టం వచ్చింది. గతంతో వేలి ముద్రలు లేకుండా ఫోటోల ఆధారంగా చేసుకునే అవకాశం ఉండేది.

పేదల పొట్ట కొట్టొద్దు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఉన్న పథకాలను కత్తిరిస్తోందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు బియ్యం కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని మండిపడుతున్నారు. పేదల పొట్ట కొట్టొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. నెలకు ఒక్కో యూనిట్‌కు 5 కేజీల బియ్యం మాత్రమే ఇస్తున్నారని, ఇదే ప్రభుత్వానికి భారమైందా అని ఆవేదన చెందుతున్నారు. ఈ–కేవైసీ పూర్తికాని వారికి కూడా బియ్యం ఇవ్వాలని కోరుతున్నారు.

వలసదారుల్లో ఆందోళన

ఉపాధి, విద్య ,ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఈ–కేవైసీ విషయంపై ఆందోళన చెందుతున్నారు. ఏ గ్రామంలో రేషన్ కార్డు ఉందో అదే గ్రామానికి వచ్చి ఈ–కేవైసీ చేసుకోవాలని అధికారులు ఆదేశిస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతాల్లో ఉన్నవారికి ఇబ్బందులు తప్పడం లేదు. వారికి మరింత గడువు ఇవ్వాలని స్థానికంగా ఉండే కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మరో పక్క ఈ–కేవైసీ పూర్తి చేయాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకు వస్తున్నారు.

నియోజకవర్గంలో వివరాలు

మండలం	మొత్తం యూనిట్లు	ఈ–కేవైసీ పూర్తయినవి
అనపర్తి	58,273	53,751
బిక్కవోలు	60.450	55.928
పెదపూడి	62,795	57,046
రంగంపేట	55,890	49,190
మొత్తం	2,37,408	2,15,915

కూలీలకు సమయం ఇవ్వాలి



రేషన్ కార్డుల్లో ఉన్న కూలీలు ఈ–కేవైసీ చేయించుకోవడానికి మరింత గడువు ఇవ్వాలి. చాలామంది ఉపాధి పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లారు. వారు తమ స్వగ్రామానికి రావడానికి కొంత సమయం పడుతుంది.

– గొర్రిపోటి లక్ష్మి, పందలపాక

ఈ నెల 30 వరకే గడువు



రేషన్ కార్డులో పేరు ఉండి ఈ–కేవైసీ పెండింగ్ ఉన్నవారు ఈ నెల 30వ తేదీలోగా ఈ ప్రకియను పూర్తి చేయించుకోవాలి. అలాంటి వారందరూ తమ డీలర్‌ను, సంబంధిత సిబ్బందిని సంప్రదించాలి.

– బీఎస్‌వీవీ కృష్ణ, తహసీల్దార్, బిక్కవోలు

కోర్టు ఆదేశాలు ధిక్కరించడంపై ఫిర్యాదు

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన తన్నీరు జయమ్మ కోర్టు ఆదేశాలను ధిక్కరించి, ఇంటి నిర్మాణం కొనసాగిస్తున్నందున ఎస్సై డి.రామ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి జి.జయభార్గవి తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రఘుదేవపురం చెరువు గట్టును ఆక్రమించి పాకల్లో నివాసం ఉండేవారని, వాటి స్థానంలో జయమ్మ ఇంటి నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. దీంతో పక్కనే ఉన్న వారు కోర్టును ఆశ్రయించగా, పనులు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయితే కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఇంటి నిర్మాణ పనులు కొనసాగించడంతో, వాటిని నిలిపివేయాలని పంచాయతీ నోటీసులు అందించినా తీసుకోవడం లేదన్నారు. దీనితో ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, ఆర్ఐ రవీంద్రల ద్వారా ఎస్సైకి ఫిర్యాదు చేశామన్నారు.

ఇసుక ర్యాంపుపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

సీతానగరం: మండలంలోని మునికూడలి ఇసుక ర్యాంపుపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ములకల్లంకకు సంబంధించి ప్రైవేటు భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి, మునికూడలి ర్యాంపు నుంచి రవాణా చేయడం జరుగుతుందన్నారు. దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో పార్థివ లింగాల తయారీ


జి.మామిడాడలో శివలింగాలు తయారు చేస్తున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామ శివారు ఎల్ఎన్ పురం పాటిమీద మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పార్థివ శివలింగాలను తయారీ భక్తిశ్రద్ధలతో జరుగుతోంది. భూ కైలాస రిలేజెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుట్టమట్టితో వీటిని తయారు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మార్చి 20వ తేదీన మొదలైన ఈ కార్యక్రమం 15 రోజుల పాటు జరగనుంది. దీనిలో పాల్గొన్న భక్తులందరికీ కమిటీ తరఫున అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. శివలింగాల తయారీ ఈ నెల 7వ తేదీతో ముగియనుంది. కాగా.. రోజుకు 1,11,111 శివలింగాల తయారు చేస్తున్నారు. వాటిని గ్రామంలో ఊరేగించి అనంతరం ట్రస్ట్ వారికి అందజేస్తారు. కార్యక్రమంలో సబ్బెళ్ల వీర వెంకట సత్యనారాయణరెడ్డి, శ్రీలక్ష్మి, సబ్బెళ్ల సత్తిరెడ్డి, ఉమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి


రంగంపేటలో తహసీల్దార్ అనసూయకు వినతి పత్రం అందిస్తున్న పాస్టర్లు

రంగంపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్‌నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కోసు అనసూయ, ఎస్ఐ తోట కృష్ణసాయికి వినతి పత్రాలు అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అడపా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కొందరు తమ స్వప్రయోజనాల కోసం మతం అనే పిచ్చితో క్రైస్తవ, హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. అలాంటి వారిని అరికట్టి హిందూ, ముస్లిం, క్రైస్తవుల మధ్య సహోదరతత్వం, మత సామరస్యం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవ సమాజం, చర్చిలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం చైర్మన్, పాస్టర్, ఇవాంజలిస్ట్ కుసుమంచి కృష్ణంరాజు, పాస్టర్లు అడపా విజయ్ కుమార్, కోటేశ్వరరావు, చక్రవర్తి, పుష్పరాజ్, జాన్ పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు


ఆఖరి రోజు పరీక్ష రాసి కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివర రోజు మంగళవారం విద్యార్థులు సోషల్ పరీక్ష రాశారు. చివరి గంట మోగగానే బయటకు వచ్చి కేరింతలు కొట్టారు. ఏడాదంతా చదువులతో ఉక్కిరిబిక్కిరైన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో చాలా సంతోషంగా కనిపించారు. మండలంలోని బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం కేంద్రాల్లో 571 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు.

రంగంపేట: రంగంపేట, సింగంపల్లి, వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చివరి రోజైన మంగళవారం సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించినట్టు మండల విద్యాశాఖాధికారి పి.మధుసూదనరావు తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం మూడు కేంద్రాలు కలిపి 577 మందికి 575 మంది హాజరయ్యారన్నారు. పబ్లిక్ పరీక్షలు విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్లకు, డిపార్ట్‌మెంట్ అధికారులకు, ఇన్విజిలేటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాజానగరం: నియోజకవర్గంలోని మూడు మండలాలలో 3,131 మంది విద్యార్థులు ఎంపిక చేసిన 18 కేంద్రాలలో పరీక్షలు రాశారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరిగాయి. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా 144 సెక్షన్ అమలు చేశారు. రాజానగరం మండలంలో చివరి రోజు 1,184 మంది విద్యార్థులకుగాను ఆరుగురు పరీక్షకు హాజరు కాలేదు.

తాగునీటి కోసం ప్రజల పాట్లు

- కోరుకొండ మండలంలో నీటి ఎద్దడి
- నిలిచిన జల్‌జీవన్ మిషన్ పనులు
- అందని సత్యసాయి పథకం నీరు


కోరుకొండ ఎస్సీపేటలో నీటి కోసం మహిళల అవస్థలు


కోరుకొండలో నిరుపయోగంగా మారిన ట్యాప్

కోరుకొండ: వేసవి నేపథ్యంలో కోరుకొండ మండలంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని 22 గ్రామాల్లో సుమారు 85 వేల మంది జనాభా ఉన్నారు. వీరందరి అవసరాలకు సరిపడా నీరు సరఫరా కావడం లేదు. మండల కేంద్రమైన కోరుకొండలో జల్‌జవన్ మిషన్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో కుళాయిలకు నీటి సరఫరా కలగా మిగిలింది. అలాగే సత్యసాయి మంచినీటి పథకం నీరు కూడా సరఫరా కాకపోవడంతో తాగునీటి ఎద్దడి ఎదురైంది.

అరకొరగా జల్‌జీవన్ మిషన్ పనులు

ప్రజలందరికీ తాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. మండల కేంద్రమైన కోరుకొండలో కేవలం 170 కుళాయిలను మాత్రమే పూర్తి చేశారు. ఆ గ్రామంలో 500 కుళాయిల ద్వారా నీటి సరఫరా చేసి ప్రజలకు దాహార్తి లేకుండా చేయాలన్నది అసలు లక్ష్యం. అయితే పాలకుల అలసత్వం కారణంగా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్న నాయకుల మాటలు ఆచరణలో నెరవేరలేదు. అలాగే జల్‌జీవన్ మిషన్ పనులతో పలు ప్రాంతాల్లోని రోడ్లు ముక్కలయ్యాయి.

తీవ్ర ఇబ్బందులు

పాలకులు పూర్తిస్థాయిలో రక్షిత నీరు అందించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ప్లాంట్లలో నీటిని కొనుగోలు చేస్తున్నారు. అలాగే పబ్లిక్ కుళాయిల ద్వారా నీరు సక్రమంగా సరఫరా జరగడం లేదు. చాలా గ్రామాలకు రెండురోజులకోసారి, కొన్ని చోట్ల రోజుకు ఒకసారి మాత్రమే నీరు సరఫరా జరుగుతోంది.

ఉత్సాహంగా ఉగాది పురస్కారాల ప్రదానం


జిత్‌మోహన్‌మిత్రను సత్కరిస్తున్న ప్రముఖులు

ధవళేశ్వరం: సినీ నటుడు, గాయకులు, శ్రీపాద జిత్ మోహన్ మిత్ర, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్ దంపతులు, యోగా గురువు తలాటం సూర్యప్రకాశరావు తదితరులకు ఉగాది పురస్కారాలను అందించారు. గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం, వాసవి కళానికేతన్, ది నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ధవళేశ్వరంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా కుమార రామం లక్ష్మీ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అధ్యక్షుడు వేలివెంటి నాగ వరప్రసాద్ (రాజా) అధ్యక్షతన సభ జరిగింది. విశిష్ట అతిథులు చేతుల మీదుగా ముత్య శంకరరావు రాసిన శంకరాంతరంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న చిన్నారికి రూ.30 వేల చెక్కు, గోసంరక్షణ కోసం రేడియం మెడబ బెల్టులు అందించారు. చిన్నారులు చేసిన సంప్రదాయ, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పంచాంగ కర్త దారముక్కల అనిల్ కుమార్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి దిశా అభ్యుదయ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు పన్నాల లక్ష్మి, కన్జ్యూమర్ రైట్స్ జాతీయ అధ్యక్షులు సాయి రమేష్, కుమార రామ్, హైకోర్టు అడ్వకేట్ తులసి, సభాపతి మంగళంపల్లి చంద్రశేఖరశాస్త్రి, నాగఫణి శర్మ, ఆదుర్తి విశ్వ మోహన్ పాల్గొన్నారు.

జోరుగా నువ్వుల పంట కోతలు


బుచ్చెంపేటలో నువ్వుల పంటను కోస్తున్న కూలీలు

కోరుకొండ: మెట్టప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో నువ్వుల పంట కోతలు జోరుగా సాగుతున్నాయి. కోరుకొండ మండలం గుమ్ములూరు, బుచ్చెంపేట, బూరుగుపూడి, నర్సాపురం, బొల్లెద్దుపాలెం తదితర గ్రామాల్లో 50 ఎకరాల విస్తీర్ణంలో వీటి సాగు జరిగింది. ఎండల తీవ్రం కావడంతో పంట కోతలు జోరందుకున్నాయి. వ్యవసాయ కూలీలు తెల్లవారుజామునే చేలల్లో పనులకు వెళుతున్నారు. ఆరు తడి పంటగా సాగు చేయడంతో చీడపీడల సమస్య ఎదురవ్వలేదు. దీంతో దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. నువ్వులు క్వింటాల్ రూ.22,200 ఉండటంతో రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపారు.

6న భారీ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

సీటీఆర్ఐ: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రాజమహేంద్రవరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు సమితి అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పతివాడ రామరాజు, కార్యదర్శి యడ్లపల్లి అయ్యప్ప తెలిపారు. జాంపేట గణేష్ చౌక్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రామరాజు మాట్లాడుతూ నాలుగేళ్లుగా శ్రీరామనవమి రోజు భారీ ఎత్తున బైక్ ర్యాలీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది మరింత శోభాయమానంగా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆ రోజు పుష్కరాల రేవు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అయ్యప్ప మాట్లాడుతూ మధ్యాహ్నం మూడు గంటలకు శంఖానాదంతో బైక్ ర్యాలీ ప్రారంభమై, త్రీటౌన్ పోలీస్ స్టేషన్, ఆర్యాపురం, పేపర్ మిల్లు, శ్రీరామ నగర్, కోరుకొండ రోడ్డు, కంబాల చెరువు, నందం గనిరాజు జంక్షన్, దానవాయిపేట, ఏవీ అప్పారావు రోడ్డు రామాలయం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, షెల్టాన్ హోటల్, ఆవలో వాంబే గృహాలు, తాడితోట, స్టేడియం రోడ్డు, శ్యామలా సెంటర్ మీదుగా తిరిగి పుష్కర్ ఘాట్‌కు చేరుకుంటుందని వివరించారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న ఆటో, సారాతో ఎక్సైజ్ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య ఆదేశాల మేరకు ఏఈఎస్ పి.నాగ రాహుల్ ఆధ్వర్యంలో నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.త్రినాథ్, ఎస్సై, సిబ్బంది మంగళవారం పేపరుమిల్లు వెనుక గల శ్రీరామ్‌నగర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలో తరలిస్తున్న 150 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కొయ్యల ప్రేమ్‌కుమార్, నిమ్మది నవీన్‌లను అరెస్టు చేశారు.

బాలుర వసతి గృహం సందర్శన


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి లక్ష్మి

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎస్.లక్ష్మి మంగళవారం సందర్శించారు. అక్కడి బాలురతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పర్యవేక్షణలో గృహంలో ఉపాధ్యాయులు చెబుతున్న పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణ, సహనశీలత మనిషికి ఉండాల్సిన ముఖ్య లక్షణాలని, వాటిని అలవర్చుకుని మంచిస్థాయికి ఎదగాలన్నారు. ఉచితంగా న్యాయవాదిని పొందడం వారి హక్కు అన్నారు. వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.